కూతవేస్తూ మెల్లగా వచ్చి ఆగింది రైలు. అమ్మానాన్నలతో కలిసి రైలు దిగాడు కుమార్. ఆ స్టేషను వూరికి కాస్త దూరంగా వుండటంతో జనసంచారం ఎక్కువగా లేదు.

వారు స్టేషన్ బయటకు రాగానే... ఎడ్ల బండిని తీసుకువచ్చిన రంగయ్య పరుగులాంటి నడకతో వచ్చి లగేజి బాగ్‌లు అందుకొని, "కరుణమ్మా! బాగున్నారా తల్లీ! అయ్యగారూ! మీరు కూడా శానాళ్లయ్యింది వచ్చి... అబ్బో సిన్నయ్యగారు మాబాగా పెద్దయిపోయారు" అంటూ అందరినీ పలుకరించి బండి దగ్గరికి దారి తీశాడు.

"రంగయ్య తాతా! నీ ఆరోగ్యం ఎలా గుంది?" అడిగింది కరుణ బండి ఎక్కుతూ...

చిన్నప్పటినుంచీ రంగయ్య వారింట్లోనే పనిచేస్తున్నాడు. కరుణ ఆయన చేతుల్లోనే పెరిగింది.

"నాకేం తల్లీ! చూడు ఎలావున్నానో...? అయినా మీమాదిరి మేమేమయినా నాజూకుగా తింటామా? సంగటి తిని యిలా సక్కగా వుంటాం" అన్నాడు రంగయ్య ఎద్దుల్ని అదిలిస్తూ...

"ఎలాగయితేనేం... మీ కరుణమ్మ కోరిక... అదే బండిలో వెళ్లాలన్న కోరిక తీరుస్తున్నావ్" అన్నాడు శంకర్.

అవునయ్యగారూ! ఇంట్లో వారంతా కారు పంపుదామనుకున్నారు స్టేషన్‌కి. అయితే కరుణమ్మగారు బండినే పంపమని గట్టిగా చెప్పడంతో నన్ను పంపారు. అయినా... కరుణమ్మా! నాకు తెలియక అడుగుతాను యింకా యీ బండిపై మమకారం ఎందుకమ్మా?" అడిగాడు రంగయ్య.



అప్పటికి బండి స్టేషన్‌ని దాటి వచ్చింది. నల్లటి తారు రోడ్డుకు యిరువైపులా పచ్చని వరిమళ్లు మెల్లగా వీచే చల్లని గాలికి ఆనందంగా తలలు వూపుతున్నట్లు కదులుతున్నాయి.

"అదేంటి తాతా! అలాగంటావు? కారులో వెళితే పదినిమిషాల్లో వెళతాం...! కాని యీ అందమయిన స్వచ్ఛమయిన ప్రకృతిని చూసి ఎన్నాళ్లయిందో...? మేం పట్నాల్లో కలుషిత వాతావరణంలో నివసిస్తున్నాం... యిలాంటి ప్రశాంత ప్రకృతిలో నిదానంగా వెళ్తుంటే మనసుకు ఎంత

## టి. సురేష్‌బాబు

# కర్తవ్యం

హాయిగా వుంటుందో...” అంది తన్మయత్వంతో కరుణ.

కరుణ వాళ్లది రామాపురం. అది ఓ మండల కేంద్రం అయినా యింకా పచ్చని పల్లె లక్షణాలు పోగొట్టుకోలేదు. కరుణ వాళ్ల నాన్న రంగనాధం... ఆ వూర్లో మోతుబరిరైతు... వందెకరాల మాగాణి పూల, పండ్ల తోటలు... యింటినిండా పశుసంపద... నిత్యం పనివాళ్లతో ఆ యిల్లు సందడిగా వుంటుంది.

రంగనాధానికి కూతురు, కొడుకు. కొడుకు శ్రీధర్ అగ్రి కల్చరల్ బీయస్సీచేసి అదే వూర్లో అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ ఆదర్శరైతుగా పేరుపొందాడు. కూతురు కరుణను పట్నంలో సాఫ్ట్‌వేర్ యింజనీరుగా పనిచేసే శంకర్‌కిచ్చి పెళ్లి జరిపించాడు. వారి అబ్బాయి కుమార్. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా పండుగకై తాతగారి వూరికి వెళుతున్నారు.



బండి నెమ్మదిగా సాగుతోంది. ఎద్దుల మెడల్లోని గంటలు ఘల్లు ఘల్లుమని విన్పిస్తున్నాయి. ఆ శ్రావ్యమయిన శబ్దానికి పక్షుల కిలకిలా రావాలు గానాన్ని అందిస్తున్నట్లున్నాయి. పొలాల నుంచి వస్తున్న మట్టివాసన వింత అనుభూతిని యిస్తోంది.

కుమార్ ఆనందం పట్టనలివికానిదిగా వుంది. నిరంతరం కాంక్రీట్ జంగిల్‌లో... వాహనాల రొదతో... పొగతో... కలిసి జీవించే వారికి యిలా ప్రశాంతమయిన ప్రకృతి లభించడం... ఊహకు అందనిది.

దారిపొడుగునా... రంగయ్య కూనిరాగాలు తీస్తూనేవున్నాడు. దాదాపు అరగంట తర్వాత బండి యింటి ముందు ఆగింది.

ఇంట్లో వారంతా బిలబిలమంటూ బయటికి వచ్చారు... కుశలప్రశ్నలతో వారిని లోపలికి తీసుకెళ్లారు.

మరునాడు ఉదయాన్నే లేచి పెరట్లో వేప పుల్లతో పళ్లుతోముకుంటున్న రంగనాధం దగ్గరకు వచ్చాడు కుమార్.

‘ఏంటి తాతయ్యా! యింకా యీపుల్లలతోనే బ్రష్ చేస్తున్నావా?” అని అడిగాడు.

“అవునురా! యిది మనకు ఆయుర్వేదం చెప్పిన పద్ధతి. రా! యిదిగో నీవూ తీసుకో”

**జాగృతి కిరణ్ ఫౌండేషన్ (నాగపూర్) సహకారంతో నిర్వహించిన “హరిత కత - 2009” లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

అంటూ కుమార్‌కు యిచ్చాడు. దాంతో నెమ్మదిగా బ్రష్ చేయడం మొదలు పెట్టాడు కుమార్. అంతలో...

"అమ్మా! సీతమ్మ వచ్చింది" గట్టిగా కేకపెట్టాడు పాలేరు. "ఆ... ఆ... తెస్తున్నా" అంది లోపలినుంచి అమ్మమ్మ. "సీతమ్మ ఎవరబ్బా" అని వాకిలి అవతలకు చూశాడు కుమార్. అక్కడ ఓ తెల్లని ఆవు తన దూడతో కలిసి నిలబడి వుంది.

"తాతయ్యా! సీతమ్మ అంటే... ఆవా?" అడిగాడు ఆశ్చర్యంగా కుమార్.

"అవునురా! అది యీవూర్లో వారందరికీ సీతమ్మ... ఏ ఊర్లో పుట్టిందో యిక్కడికి వచ్చింది. దేవాలయంలో వుంటుంది. ఉదయాన్నే యింటింటికీ వస్తుంది. దీనికి భిక్షమేయడం మా అదృష్టంగా అనుకొంటాం. గోవు మనకు పూజనీయం. గోసంపద పుష్కలంగా వుంటే దేశం బాగా వుంటుందని గాంధీగారు అనేవారు" అన్నాడు రంగనాథం.

"ఆ... ఆ... యీ వివరాలన్నీ తర్వాత చెప్పవచ్చు... ముందు త్వరగా స్నానంచేసి రండి" అంది అమ్మమ్మ నవ్వుతూ లోపలినుంచి చేటలో ధాన్యాన్ని తీసుకువస్తూ.

కుమార్ అమ్మమ్మ వెంట పరిగెత్తుకుని ఆవు వద్దకు వెళ్లాడు. చేటలో ధాన్యం ఎదురుగా పెట్టి, ఆవు కొమ్ములకు పసుపురాసి, నుదుటిన కుంకుమ పెట్టి నమస్కరించింది అమ్మమ్మ. సీతమ్మ మౌనంగా ధాన్యం తింటూంటే... దూడ పాలు త్రాగుతోంది. ఈ దృశ్యం బాగా ఆకర్షించింది కుమార్‌ని. పరిగెత్తుకు వెళ్లి పెరట్లో కాస్త పచ్చగడ్డిని తీసుకువచ్చి దానికి తినిపించాడు. సీతమ్మ ఆప్యాయంగా చూస్తూ తింటుంటే తృప్తిగా ఫీలయ్యాడు.

ఆ పదిరోజులు పండుగ సంబరాలు ఒక ఎత్తయితే సీతమ్మతో, దూడతో కలిసి తిరగడం ఒక ఎత్తయ్యింది కుమార్‌కి. దూడవెంట పరుగులు తీయడం, పాలేర్లతో కలిసి వాటిని కడగడం, గడ్డిమేపడం యిలా వాటికి చాలా దగ్గరయ్యాడు.

సెలవులు పూర్తయి తిరిగి పట్నానికి వెళ్లేటప్పుడు ఎన్నడూ లేనిది ఏదో భారంగా ఫీలయి... మనసంతా అశాంతితో నిండిపోయింది.

* * *

మరో నెల తర్వాత...

కుమార్ బర్త్‌డే ఫంక్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసాడు శంకర్. ఇంటి వద్ద షామియానాలు వేశారు. రంగురంగుల బల్బులు అమర్చారు. కుర్చీలు వేయించారు. పెద్ద స్టేజి ఏర్పాటు చేసారు. కుమార్ క్లాస్‌మేట్స్ అందరూ వచ్చారు. శంకర్ ఫ్రెండ్స్ ఫ్యామిలీలతో వచ్చారు. అంతా సందడిగా వుంది.

ఓ ప్రక్కగా రకరకాల వంటలు అందంగా టేబుల్స్‌పై అమర్చబడి వున్నాయి. వాటిప్రక్కగా వాటర్ క్యాన్‌లు, యూజ్ అండ్ త్రో గ్లాస్‌లు, వాటర్ బాటిల్స్... ఎవరికి కావలసినవి వారికి సిద్ధంగా వున్నాయి.

కుమార్ కేక్ కట్‌చేసాడు. అందరూ గోల గోలగా "హ్యాపీ బర్త్‌డే టూ యూ" అంటూ పాడారు. క్యారీబ్యాగ్‌లలో తెచ్చిన రకరకాల గిఫ్ట్‌లు అందించారు.

బఫే సిస్టమ్‌లో ఎవరికి కావలసినవి వారు తెచ్చుకొని తింటున్నారు... ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌తో చేసిన యూజ్ అండ్ త్రో ప్లేట్లు, స్పూన్‌లు, కప్పులు, ఫోర్క్‌లే కన్పిస్తున్నాయి.

అందరి విషెష్ అందుకొన్న తరువాత తను

కూడా ఓ ప్లేట్ తీసుకున్నాడు కుమార్.

అంతలో శంకర్ వచ్చి "తాతయ్య లైన్లో వున్నాడు మాట్లాడు" అంటూ సెల్ యిచ్చారు.

"ఆ... తాతయ్యా! నేను కుమార్‌ని... బాగు న్నావా?" అడిగాడు కుమార్.

"ఆ... బాగున్నాంరా! ఫంక్షన్‌కు రాలేక పోయాం... గ్రీటింగ్స్ చెబుదామని... హ్యాపీ బర్త్‌డే" అవతలనుంచి తాతయ్య అన్నాడు.

"థ్యాంక్యూ తాతయ్యా"

"ఆ... యిదిగో మీ అమ్మమ్మ మాట్లాడు తుందట..."

"ఆ... యివ్వు"

"కుమార్! నీకు పుట్టినరోజు శుభాకాంక్షలు! ఇలాగే కలకాలం చల్లగా వుండాలి" చెప్పింది అమ్మమ్మ.

"థ్యాంక్యూ అమ్మమ్మా! అన్నట్టు సీతమ్మ ఎలావుంది...?"

"అదీ... సీతమ్మ..."

"ఆ... చెప్పు అమ్మమ్మా! సీతమ్మకు ఏమ య్యింది?" ఆదుర్దాగా అడిగాడు.

"మరి... మరి... ఎలా చెప్పాలిరా..."

"ప్లీజ్ అమ్మమ్మా! త్వరగా చెప్పు"

"మన సీతమ్మ యిక లేదురా... దేవుని దగ్గరకు వెళ్లిపోయింది"

"అమ్మమ్మా!..." గొంతు దుఃఖంతో పూడు కుపోయింది.

"అవునురా! యిది జరిగి మూడురోజుల య్యింది. నీకు ఈ టైమ్‌లో చెప్పకూడదు అని అనుకున్నా... అబద్ధం చెప్పలేక..."

"ఎలా జరిగింది అమ్మమ్మా? బాగానే వుండే ది కదా!" అడిగాడు కన్నీళ్లతో...

"ఏమోరా! ఆమధ్య జాతర జరిగింది కదా! దేవాలయం ప్రక్కగా పారవేసిన ప్లాస్టిక్ సంచు లు... అవేరా పాలథీన్ సంచులు అంటారే వాటిని తినడం వల్ల అవి ప్రేగుల్లో నిండి పోయి... చనిపోయిందని అంటున్నారు" చెప్పిం ది అమ్మమ్మ.

కుమార్ చేతిలో ప్లేటు జారి క్రింద పడింది.

* * *

కుమార్‌కి స్కూల్లో సైన్స్ టీచర్ చెప్పిన విషయాలు గుర్తుకువస్తున్నాయి. ప్లాస్టిక్, పాలి థీన్ వస్తువులు భూతంలా మారి భూమిని కబళి స్తున్నాయి. అవి కుళ్లిపోక భూమండలమంతా నిండి సరిక్రొత్త కాలుష్యాన్ని కల్గిస్తున్నాయి. మనం వివిధ ఆహార పదార్థాలకై ఉపయోగించే క్యారీ బాగ్‌లు, ప్లేట్స్ పారవేస్తాం... వాటిల్లో మిగిలిన ఆహారం కొరకై మూగజీవులు వాటితో సహా తినేస్తాయి. పాపం ఎన్నో మూగజీవాలు యిలా బలైపోతున్నాయి... యీ వినాశనానికి మనమే ప్రధాన కర్తలం... సీతమ్మ లాంటి ఆవు ను చంపేశాం... దారుణం... ఆలోచనలు మనస్సులో సుడులు తిరుగుతున్నాయి.

"నో... యీ పాలిథీన్, ప్లాస్టిక్‌లను వాడటం తగ్గించాలి... ప్రాణుల్ని కాపాడాలి" గట్టిగా అరిచాడు కుమార్.

ఏం జరిగింది?... అనుకుంటూ అంతా వచ్చారు.

"నాన్నా! వద్దు నాన్నా! ఇలా ప్లాస్టిక్ వస్తువు లను వాడవద్దు... పాలిథీన్ క్యారీబ్యాగ్‌లను అసలే ఉపయోగించొద్దు... పర్యావరణం నాశ నం కాకుండా... జీవులు నశించకుండా కాపా డుకుందాం... యిది మన అందరి కర్తవ్యం..." అంటూ శంకర్ చేతుల్ని పట్టుకొని వలవలా ఏడవసాగాడు కుమార్.